సాక్షి నంద్యాల

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు, వీరభద్ర స్వామి వారికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



..స్పందన కరువు

ప్రభుత్వం ప్రారంభించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి రైతుల నుంచి స్పందన కరువైంది. రైతులు లేక పలు మండలాల్లో ఈ కార్యక్రమం తూతూమంత్రంగా సాగుతోంది. - 8లో



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.90
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.500
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 7,980
అవుట్ ఫ్లో	: 10,153

న్యూస్‌రీల్

బానకచెర్ల నుంచి తగ్గిన నీటి విడుదల



ఎస్ఆర్ఎంసీలో ప్రవహిస్తున్న నీరు

పాములపాడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి మంగళవారం నీటి విడుదల 18,000 క్యూసెక్కుల నుంచి 15,000 క్యూసెక్కులకు తగ్గించినట్లు జేఈ దేవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి ఎస్ఆర్ఎంసీ కాలువ ద్వారా 15,000 క్యూసెక్కుల నీరు బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు వచ్చి చేరుతుందన్నారు. కాగా తెలుగుగంగకు 5 వేలు క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 3 వేలు, జీఎన్ఎస్ఎస్‌కు 7 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

28 నుంచి 'మన ఇళ్లు.. మన గౌరవం'



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య

ఆళ్లగడ్డ: ఈనెల 28వ తేదీ నుంచి 'మన ఇళ్లు.. మన గౌరవం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. 2019 నుంచి 2024 వరకు ఇల్లు పూర్తి కాకుండా మిగిలి పోయిన లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. 2025 మార్చికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో బిల్లులు రావని లబ్ధిదారులకు సూచించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ మహబుబ్‌ఖాన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జేసీ ఆకస్మిక తనిఖీ

బండిఆత్మకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ ల్యాండ్ రికార్డుల పట్ల రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యలను గడువులోగా పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. ఆయన వెంట ఆర్డీవో దాస్, తహసీల్దార్ ధోని ఆల్‌ఫ్రెడ్ ఉన్నారు.

నేడు స్వర్ణ రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం మహా క్షేత్రంలో ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 8.30 గంటలకు స్వర్ణ రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ డి.పెద్ది రాజు తెలిపారు. ముందుగా వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు చేపడుతామన్నారు. అనంతరం ఆలయ మాడవీధులలో స్వర్ణరథోత్సవం కొనసాగుతుందన్నారు. దేవస్థానం వైదిక కమిటీ వారి సూచన మేరకు ప్రతీ మాసంలో వచ్చే ఆరుద్రా నక్షత్రం రోజున స్వామిఅమ్మవార్ల స్వర్ణరథోత్సవం నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

సుంకేసులకు వరద

కర్నూలు సిటీ: జిల్లా పశ్చిమ ప్రాంతంలో కురిసిన వర్షాలతో తుంగభద్ర నదికి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. సోమవారం రాత్రి కురిసిన వర్షాలతో మంగళవారం సుంకేసుల బ్యారేజీకి 3,450 క్యుసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది.

జెడ్పీలో బదిలీల చిచ్చు



ఎంపీడీఓల బదిలీల్లో పొడచూపిన విభేదాలు

- మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులపై భిన్నాభిప్రాయాలు
- 12 మండలాలపై 'పట్టు'
- వేర్వేరుగా జాబితాలు విడుదల చేసిన చైర్మన్, సీఈఓ
- చైర్మన్ నోట్ అప్రూవల్ లేకుండా జాబితాలోకి పలు పేర్లు
- చైర్మన్, సీఈఓ మధ్య పెరిగిన దూరం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్‌లో బదిలీల చిచ్చు రగులుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22 వరకు గడువు విధించింది. ఈ నేపథ్యంలోనే జిల్లా పరిషత్ పరిధిలోని ఎంపీడీఓ, ఏఓ, సీనియర్ సహాయకులు, జూనియర్ సహాయకులు, రికార్డు అసిస్టెంట్లు, టైపిస్టు, జెడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లు, ఆఫీసు సబార్డినేట్ల బదిలీలు తెరపైకి వచ్చాయి. అన్ని కేడర్లలోని ఉద్యోగుల బదిలీలు ఒక కొలిక్కి వచ్చినా.. ఎంపీడీఓల బదిలీల్లో రాజకీయం ప్రముఖ పాత్ర పోషించడం గమనార్హం. దీంతో జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి మధ్య విభేదాలు వచ్చాయి. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు జెడ్పీ పరిధిలోని ఉద్యోగుల బదిలీలపై పూర్తి స్థాయి అధికారం జెడ్పీ చైర్మన్‌కు ఉంటుంది. జిల్లా పరిషత్‌లో పూర్తి మెజారిటీ వైఎస్సార్‌సీపీకి ఉన్నా.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులను కొద్దోగొప్పో అమలు చేయాల్సిన బాధ్యత సీఈఓపై పడింది. దీంతో వీరిద్దరి మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయి. ఎంపీడీఓల బదిలీలకు సంబంధించిన జాబితాలను జెడ్పీ చైర్మన్, సీఈఓ వేర్వేరుగా రూపొందించారు. 40 మంది ఎంపీడీఓలను బదిలీ చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి పేరుతో ఒక జాబితా, 42 మంది ఎంపీడీఓలను బదిలీ చేస్తూ సీఈఓ నాసరరెడ్డి సంతకంతో రూపొందించిన మరో జాబితా చక్కర్లు కొడుతున్నాయి. కొందరు ఎంపీడీఓల పేర్లు చైర్మన్ జాబితాతో ఉండగా, సీఈఓ జాబితాలో వాటికి చోటు దక్కలేదు. సీఈఓ రూపొందించిన జాబితాలోని పలు పేర్లు చైర్మన్ జాబితాలో లేకపోవడం వంటి ఘటనలు చర్చనీయాంశంగా మారాయి. దీంతో ఏ జాబితా చెల్లుబాటు అవుతుందోనని ఎంపీడీఓలు ఆందోళన చెందుతున్నారు. కాగా.. జెడ్పీ చైర్మన్ నోట్ అప్రూవల్ లేకుండానే జాబితాలో మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 12 మండలాలకు చెందిన ఎంపీడీఓల బదిలీల్లో మార్పులు చోటు చేసుకున్నాయి.

జాబితాల్లో మారిన మండలాలు

పనిచేస్తున్న మండలం	ఎంపీడీఓ పేరు	జెడ్పీ చైర్మన్ జాబతాలో బదిలీ చేసిన మండలం	సీఈఓ జాబితాలో బదిలీ చేసిన మండలం
కోడుమూరు	ఎస్ చంద్రశేఖర్	గోనెగండ్ల	పాములపాడు
పగిడ్యాల	జి వెంకటరమణ	పెద్దకడుబూరు	బనగానపల్లె
ప్యాపిలి	ఫజుల్‌రహమాన్	డోన్	బేతంచెర్ల
వెలుగోడు	షేక్ అమానుల్లా	రుద్రవరం	ఆలూరు
అనంతపురం	పీ.సుమిత్రమ్మ	పాములపాడు	మంత్రాలయం
అనంతపురం	వై.పుల్లయ్య	బనగానపల్లె	నందవరం
వైఎస్సార్ కడప	కే.వరప్రసాదరావు	కోసిగి	కోవెలకుంట్ల
వైఎస్సార్ కడప	ఎన్.భాగ్యలక్ష్మి	నందవరం	రుద్రవరం
అనంతపురం	ఐ.సోలోమన్	ఉయ్యాలవాడ	సంజామల

చైర్మన్ జాబితాలో లేని పేర్లు

జెడ్పీ చైర్మన్ జాబితాలో లేని ముగ్గురు ఎంపీడీఓల పేర్లు సీఈఓ జాబితాలో ప్రత్యక్షమయ్యాయి. బేతంచెర్ల నుంచి సి.వెంగన్నను కొలిమిగుండ్లకు, అవుకు నుంచి జి.వెంకటేశ్వరరెడ్డిని డోన్‌కు, మంత్రాలయం నుంచి ఎం.మణిమంజరిని గోనెగండ్లకు బదిలీ చేసినట్లు సీఈఓ జాబితాలో పేర్కొన్నారు. అలాగే ఉయ్యాలవాడ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వరరావును కోవెలకుంట్లకు బదిలీ చేసినట్లు చైర్మన్ జాబితాలో ఉండగా, సీఈఓ జాబితాలో ఆయన పేరు లేకపోవడం గమనార్హం.

జెడ్పీ పరిధిలో 167 మంది ఉద్యోగుల బదిలీ

జిల్లా పరిషత్ పరిధిలో 167 మంది ఉద్యోగులను బదిలీ చేసినట్లు సమాచారం. వీరిలో ఏఓలు 22, సీనియర్ అసిస్టెంట్లు 33, జూనియర్ అసిస్టెంట్లు 45, టైపిస్టులు 12, రికార్డు అసిస్టెంట్లు 27, ల్యాబ్ అసిస్టెంట్లు 11, లైబ్రరీ అసిస్టెంట్లు 12, ఆఫీసు సబార్డినేట్లు ఐదుగురు ఉన్నారు. వీరందరికీ ఈ నెల 25న బదిలీ ఉత్తర్వులు అందనున్నట్లు తెలిసింది.

జిల్లాలో మోస్తరు వర్షం



డోన్ మండలం దొరపల్లెలో కంది పైరులో నిలిచిన వర్షపు నీరు

నంద్యాల(అర్బన్): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. డోన్ మండలంలో అత్యధికంగా 48 మి.మీ, అవుకు 45.4, ఆత్మకూరులో 32.4, కోవెలకుంట్ల మండలంలో 27, కొలిమిగుండ్ల 35, దొర్నిపాడు 17.8, ఉయ్యాలవాడ మండలంలో 1.6 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. కోత దశలో మొక్కజొన్న పైరు దెబ్బతినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వాగులు, వంకలకు వరద నీరు చేరింది.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

ఎమ్మిగనూరు రూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి వచ్చే నెల 7వరకు గడవు పొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ. పద్మావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాకు చెందిన విద్యార్థులు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోకుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.2.94 కోట్లు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి హుండీ ఆదాయం రూ.2,94,57,810గా వచ్చింది. మంగళవారం శ్రీమఠం రాజాంగణ భవనంలో సేవా భక్తులతో కానుకలు లెక్కించారు. రాఘవేంద్రస్వామి ప్రధాన హుండీ, మంచాలమ్మ హుండీ, అన్నపూర్ణ భోజన శాల హుండీ, క్యూలైన్ల హుండీలోని కానుకలు లెక్కించారు. నగదుతో పాటు బంగారు 70 గ్రాములు, వెండి 1,240 గ్రాములు వచ్చింది.

అను'గృహ'మెన్నడో!

- పూర్తి కాని శ్రీశైల దేవస్థాన సిబ్బంది వసతి గృహాలు
- రూ.39 కోట్లతో మూడు బ్లాకులుగా నిర్మాణ పనులు
- చివరి దశలో ఆరు నెలల ఈఓటీ కోరిన కాంట్రాక్టర్



దేవస్థాన వసతి గృహ సముదాయంలో బి-బ్లాకు



బీ బ్లాక్‌లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు

శ్రీశైలంటెంపుల్: తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైల దేవస్థాన సిబ్బందికి కొండ కింద చేపట్టిన గృహ నిర్మాణ పనులు కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతానికి 80 శాతం పనులు పూర్తయినా కాంట్రాక్టర్ మరో ఆరు నెలలు గడువు పొడిగింపు కోరగా.. ఇందుకు ఈఓ అనుమతి ఇచ్చారు. దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు ఇంటి నిర్మాణాలు చేపట్టి శ్రీశైలాన్ని టెంపుల్ సిటీగా మార్చాలని 2015లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని సున్నిపెంటలో ఇరిగేషన్ శాఖకు చెందిన సుమారు 20 ఎకరాల్లో దేవస్థాన ఉద్యోగుల వసతి సముదాయ నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. మొదట్లో ఓ కాంట్రాక్టర్ సుమారు రూ. 49 కోట్లతో పనులు దక్కించుకొని కొంత వరకు పనులు చేశారు. అయితే కరోనాతో రెండేళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. అలాగే ఎస్ఎస్ఆర్ రేట్లు కూడా పెరగడంతో సంస్థపై భారం పడుతుందని ఆయా నిర్మాణ పనులను నిలిపివేసింది. ఆ తరువాత శ్రీశైల దేవస్థానానికి చైర్మన్‌గా నియమితులైన రెడ్డివారి చక్రపాణిరెడ్డి సిబ్బంది వసతి గృహాల నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించి సుమారు రూ.39 కోట్లతో టెండర్లు పిలిచారు. 2023 మార్చిలో వైవీఆర్ కన్‌స్ట్రక్షన్ పనులను దక్కించుకుంది. 18 నెలల కాలపరిమితితో పనులు పూర్తి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నెలతో కాలపరిమితి పూర్తవుతుంది. ఇప్పటికి 80 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా ఫినిసింగ్, కార్పెంటరీ, ఎలక్ట్రికల్, పెయింటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా పనులు పూర్తి చేసేందుకు మరో ఆరు నెలలు గడువు ఇవ్వాలని కాంట్రాక్టర్ దేవస్థాన ఈఓకు విన్నవించగా ఈఓ అనుమతించారు. ఈ ఆరు నెలల్లో అయినా పనులు పూర్తవుతాయో లేదోనని ఆలయ ఉద్యోగులు, సిబ్బంది చర్చించుకుంటున్నారు.

మూడు బ్లాకుల్లో.. 297 గృహాలు

దేవస్థాన రెగ్యులర్ ఉద్యోగులు మొత్తం సుమారు 260 మంది ఉంటారు. వీరి కోసం ఏ, బీ, సీ అని మూడు బ్లాక్‌ల్లో మొత్తం 297 వసతి గృహాలు నిర్మిస్తోంది.

- ఏ-బ్లాకులో మొత్తం 4 సబ్ బ్లాకులు ఉన్నాయి. ఒక్కొక్క బ్లాకులో 27 గృహాలు నిర్మిస్తున్నారు. అటెండర్లు, వాచ్ మెన్లు, కిందిస్థాయి సిబ్బందికి (నాల్గవ తరగతి ఉద్యోగుల) కోసం గృహాలు నిర్మిస్తున్నారు.
- బీ-బ్లాకులో మొత్తం నాలుగు బ్లాకులు ఉన్నాయి. ఒక్కొక్క బ్లాకులో 27 గృహాలు నిర్మిస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు తదితరుల వారి కోసం నిర్మిస్తున్నారు. ఇందులో సింగిల్ బెడ్‌రూం, హాలు, కిచెన్ ఉంటాయి.
- సీ-బ్లాకులో మొత్తం మూడు బ్లాకులు ఉన్నాయి. ఒక్కొక్క బ్లాకులో 27 గదులు నిర్మిస్తున్నారు. రెండు బెడ్ రూంలు, హాలు, కిచెన్ నిర్మిస్తున్నారు. సూపరింటెండెంట్, సహాయ కార్యనిర్వహణాధికారి తదితర వారి కోసం నిర్మిస్తున్నారు.

అదనపు సౌకర్యాలకు ప్రతిపాదనలు..

దేవస్థాన ఉద్యోగుల వసతి గృహాల సముదాయంలో వసతి గదులతో పాటు రోడ్లు నిర్మించాల్సి ఉంది. అలాగే వసతి గృహాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. తాగునీటి సౌకర్యం కోసం శ్రీశైలం డ్యాం నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్, స్టోరేజ్ ట్యాంకులు నిర్మించాల్సి ఉంది. అలాగే విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆయా పనులకు సంబంధించి టెండర్లు పిలిచేందుకు దేవదాయశాఖ కమిషనర్ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.

మధ్యాహ్న భోజనం నిర్వాహకుల 'కడుపుకొట్టారు'!

తెలుగు తమ్ముళ్ల దౌర్జన్యం

- ఎలాంటి తప్పు లేకపోయినా తొలగింపు
- ప్రిన్సిపాల్ ఎదుటే వంట సామగ్రి బయటపడేసిన వైనం
- ఇదేమిటని నిలదీయడంతో నిర్వాహకుల గెంటివేత



మిడుతూరు మోడల్ స్కూల్‌లో వంట నిర్వాహకుల సామగ్రి బయట పడేసిన తెలుగు తమ్ముళ్లు

నందికొట్కూరు: తెలుగు తమ్ముళ్లు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులపై దాడులు, వంట సామగ్రి పాఠశాల నుంచి బయట పడేసిన ఘటన మంగళవారం మిడుతూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక మోడల్ స్కూల్‌లో పదేళ్ల నుంచి మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులుగా పని చేస్తున్న నాగలచ్చమ్మ, హమద్‌బీ, లీలావతి, చాందినీలకు చెందిన వంట సామాన్లను తెలుగు తమ్ముళ్లు ఎలాంటి సమాచారం లేకుండా పాఠశాల సమయంలో ప్రిన్సిపాల్ సలీంబాషా సమక్షంలో గది నుంచి బయట పడేశారు. టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, అతని అనుచరులు సుమారు 15 మంది కలిసి మోడల్ స్కూల్‌కు వెళ్లి దౌర్జన్యం చేశారు. ఈ నలుగురినీ వంట చేయనివ్వకుండా టీడీపీకి చెందిన మహిళలతో వంట చేయించారు. ఏమి తప్పు చేశామని టీడీపీ నాయకులను నిలదీసిన వంట నిర్వాహకులకు ఎలాంటి సమాధానం చెప్పకుండా.. ఈ రోజు నుంచి మీరు రావాల్సిన అవసరం లేదని, మీ ఇష్టం వచ్చిన వారికి ఫిర్యాదు చేసుకోండని వారిని బయటకు గెంటేశారు. ఇదిలాఉంటే మండలంలోని దేవనూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోనూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా టీడీపీ శ్రేణులు వంట సామాన్లు బయటపడేయటం గమనార్హం.

రాజకీయ ఒత్తిళ్లతోనే తొలగించాం

మోడల్ స్కూల్, దేవనూర్ జడ్పీ హైస్కూల్ వంట నిర్వాహకులను అధికార పార్టీ ఆదేశాల మేరకు విద్యా కమిటీ తీర్మానం చేసి కొత్త వాళ్లను నియమించాం. మండలంలోని అన్ని స్కూల్స్‌లో అధికార పార్టీ నాయకుల సిఫారసు మేరకు విద్యా కమిటీలతో తీర్మానం చేయించి తొలగించాం. మోడల్ స్కూల్‌లోకి తెలుగుదేశం పార్టీ నాయకులు వెళ్లి వంట గదిలో నుంచి సామాన్లు బయట పడేసిన విషయం మాకు తెలియదు.

– శ్రీనాథ్, ఎంఈఓ-2 మిడుతూరు మండలం

రియల్... ఢమాల్



రైతునగర్ సమీపంలోని రామకృష్ణానగర్ వద్ద వెంచర్లు

- ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడు మూడేళ్ల క్రితం రైతునగరం వద్ద బైపాస్ ఏర్పాటు అవుతుందని, స్థలాలకు మంచి డిమాండ్ వస్తుందని భావించి సెంటు రూ.12 లక్షలు వెచ్చించి నాలుగు ప్లాట్లు కొనుగోలు చేశారు. ప్రస్తుతం అవసరం నిమిత్తం కొన్న ధరకు విక్రయించాలని ప్రయత్నం చేస్తున్నా ఎవరూ ముందుకు రావడం లేదు.
- రెండేళ్ల క్రితం నంద్యాలకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి కర్నూలు-కడప బైపాస్ సమీపంలో సెంటు రూ.10 లక్షల చొప్పున 5 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశాడు. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి డబ్బు అవసరం కావడంతో స్థలాన్ని అమ్మేందుకు రియల్ ఎస్టేట్ బ్రోకర్‌ను సంప్రదించారు. మార్కెట్‌లో ధర లేదని, సెంటు రూ.7.50 లక్షలు మాత్రమే ఉందని చెప్పడంతో చేసేది లేక యువకుడు ఆ ధరకే అమ్మేసి భారీగా నష్టపోయాడు.



అయ్యలూరు సమీపంలోని ఓ వెంచర్

- భారీగా పడిపోయిన స్థిరాస్తి క్రయ, విక్రయాలు
- మందకొడిగా రిజిస్ట్రేషన్లు
- ఈ ఏడాది లక్ష్యం రూ.153.10 కోట్లు
- నాలుగు నెలల్లో వసూలైన మొత్తం రూ.66.17 కోట్లు

నంద్యాల(అర్బన్): రియల్ ఎస్టేట్ రంగంలో క్రయ, విక్రయాలు పూర్తిగా తగ్గిపోయాయి. గతంలో భూములు కొనుగోలు చేసిన వాళ్లు ఇప్పుడు అమ్ముదామంటే కొనేవారు లేక ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాలను జిల్లా కేంద్రంగా ప్రకటించడంతో చుట్టుపక్కల ప్రాంతాల భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రజలకు పాలన చేరువ కావడంతో పాటు రియల్ ఎస్టేట్‌కు బూమ్ వచ్చింది. భూములకు మంచి రేట్లు రావడంతో వ్యాపారులతో పాటు రైతులు కూడా ఎంతో ఆనందపడ్డారు. జిల్లా అభివృద్ధికి బాటలు పడ్డాయని సంబరపడ్డారు. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లా వాసుల ఆశలు ఆడియాసలయ్యాయి. గొడవలు, దాడులతో ఎక్కడికక్కడ జనాలు బెంబేలెత్తిపోతున్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోనే టీడీపీ, బీజేపీ నాయకులు చేస్తున్న నిర్వాకంతో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందనే విమర్శలు వస్తున్నాయి. ఈ వార్షిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ శాఖకు రూ.153.10 కోట్లు లక్ష్యంగా నిర్ణయించగా నాలుగు నెలల్లో కేవలం రూ.66.17 కోట్లు మాత్రమే వసూళ్లు అయ్యాయి. నిర్ణయించిన లక్ష్యంలో 33 శాతం కూడా రెవెన్యూ రాని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, అన్నింటా మైనస్ గ్రోత్‌రేటు నమోదైంది. జిల్లా కేంద్రంతో పాటు పట్టణ సమీప ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం రెండేళ్ల క్రితం వరకు ఓ వెలుగు వెలిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్థలాలు, పొలాల అమ్మకాలకు మంచి డిమాండ్ ఉండగా ప్రస్తుతం స్థలాలకు ధరలు తగ్గి రియల్ వ్యాపారం ఢమాల్ అయ్యింది. రియల్ బ్రోకర్లు అధికం కావడంతో పోటీ తత్వం పెరిగి విపరీతంగా స్థలాలు, పొలాల కొనుగోలు అధిక ధరలకు కొనుగోలు చేశారు. ఆ ధరలతో స్థలాలను కొనుగోలు చేసేందుకు ప్రస్తుతం ఎవరూ ముందుకు రాకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలు అయ్యింది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా లక్ష్యం, వసూళ్లు వివరాలు

2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	లక్ష్యం (రూ. లక్షల్లో)	వసూళ్లు (రూ.లక్షల్లో)
ఆళ్లగడ్డ	1,574.67	687.99
ఆత్మకూరు	827.64	363.96
బనగానపల్లె	791.26	349.60
డోన్	1,720.97	939.41
కోవెలకుంట్ల	757.87	434.80
నందికొట్కూరు	1,487.76	600.65
నంద్యాల	4,864.23	1,871.17
అవుకు	441.78	202.64
పాణ్యం	581.48	133.76
ప్యాపిలి	507.57	316.38
శిరివెళ్ల	704.60	272.11
బండిఆత్మకూరు	436.26	174.02
బేతంచెర్ల	614.63	270.55

క్రయ విక్రయాలు తగ్గాయి

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ మాసం నుంచి సెప్టెంబర్ వరకు భూముల క్రయవిక్రయాలు తగ్గాయి. భూములు గతంలో అధిక ధరలకు కొనుగోలు చేశారు. పెరిగిన భూములు, స్థలాలను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. క్రయ, విక్రయాలు తగ్గడంతో ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది.

– చెన్నకేశవరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్, నంద్యాల

భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

నంద్యాల(అర్బన్): ప్రతి రైతు భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వినియోగించాలని డీఏఓ మురళీకృష్ణ సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మునగాల, రాయమాల్పురం గ్రామాల పరిధిలోని పొలాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. డీఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ పథకాల గురించి అవగాహన కల్పిస్తూ, శాస్త్రవేత్తల పరిశోధనా ఫలితాలను రైతులకు చేరవేయాలన్నారు. పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెరిగేలా చూసినప్పుడే రైతులు ఆనందంగా ఉంటారన్నారు. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ- పంట, ఈకేవైసీలను తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనేటప్పుడు తప్పని సరిగా రసీదులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, హెచ్ఓ శ్రీధర్, ఏఈఓ మణిమోహన్ రెడ్డి, మనోహర్, సర్పంచ్ పార్వతమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఈడీ పరీక్షల్లో 96 శాతం హాజరు

కర్నూలు కల్చరల్ : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం జరిగిన బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షకు 96 హాజరు శాతం నమోదైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో 3,231 మందికి 3,091 మంది హాజరైనట్లు వెల్లడించారు.

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి నియమితులయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఇవ్వకుండా మొండిచేయి చూపిన ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో పార్టీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపిస్తే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సముచిత స్థానం కల్పిస్తామని సుబ్బారెడ్డికి హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగిసిన తర్వాత నుంచి ఎడమొఖం పెడమొఖంగా ఉన్న ఎమ్మెల్యే కోట్ల, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డిలు వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం సుబ్బారెడ్డికి ఏపీ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించడంతో ఉప్పు, నిప్పుగా ఉన్న ఇరువర్గాలు ఎలా కలిసి పనిచేస్తాయో వేచిచూడాల్సిందే. ఇది ఇలా ఉండగా, కోట్ల విజయానికి కృషిచేసిన తమ వర్గానికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టడంలో తెలుగుదేశం పార్టీ మొండిచేయి చూపిందని రాష్ట్ర మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ వర్గీయులు మండిపడుతున్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో కేసు

పెద్దకడబూరు: విద్యార్థినులకు అసభ్యకర వీడియోలు చూపిస్తున్న ఘటనలో ఓ ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. మండల కేంద్రం పెద్దకడబూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆదిఆంధ్ర)లో కోసుప్రసాద్ ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఈయన తన ఫోన్ ద్వారా అసభ్యకర వీడియోలను చూపిస్తున్నట్లు ఎంఈఓ సువర్ణల సునీయంకు ఫిర్యాదు అందింది. దీనిపై ఆమె విచారించి మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



శ్రీనివాసులు(ఫైల్)

బేతంచెర్ల: మండలపరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయ రోడ్డులో ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. బేతంచెర్ల పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన కుంచె రాజు, లక్ష్మీదేవి కొడుకు శ్రీనివాసులు అదే కాలనీకి చెందిన గణేష్‌తో కలిసి ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాద వశాత్తు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కుంచె శ్రీనివాసులు (23) తలకు తీవ్రగాయాలయ్యి అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా యాలైన గణేష్‌ను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య సంరక్షకులు!

- మందుల సూత్రదారి ఫార్మసిస్టు
- ఔషధాల వినియోగంపై దిక్సూచి
- వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తో రోగులకు మందులు పంపిణీ
- జిల్లాలో 9 వేల మంది ఫార్మాసిస్టులు
- మెడికల్ షాపుల్లో వారిదే కీలక పాత్ర
- నేడు వరల్డ్ ఫార్మసిస్ట్ డే



కర్నూలు(హాస్పిటల్):మనకు ఏదైనా జబ్బు చేసినప్పుడు డాక్టర్‌ను కలిసి ఆయన రాసిచ్చిన మందుల చీటీని మెడికల్‌షాపులో చూపించి మందులు తీసుకుంటాము. ఆ మందులు ఎలా, ఎప్పుడు వేసుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, అవి ఎలా పనిచేస్తాయనే విషయాల గురించి అవగాహన కల్పించేవాడే ఫార్మాసిస్టు. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణకు ఫార్మాసిస్టులు చేసిన అమూల్య సహకారాన్ని గౌరవించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఔషధాల సురక్షితమైన, ప్రభావంతమైన వినియోగాన్ని నిర్ధారించడంలో ఫార్మాసిస్టులు పోషించే కీలకపాత్ర గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3వేల రిటైల్ మెడికల్ షాపులు ఉన్నాయి. అందులో కర్నూలులో 1700, నంద్యాల జిల్లాలో 1300 దుకాణాలు ఉన్నాయి. వీటితో పాటు హోల్‌సేల్ దుకాణాలు మరో 700 దాకా ఏర్పాటయ్యాయి. వాటిలో మొత్తం 9వేల మందికి పైగా ఫార్మాసిస్టులు సేవలందిస్తున్నారు. జిల్లాల విభజన జరిగాక ఆయా జిల్లాల్లో ఔషధ నియంత్రణాధికారులు దుకాణాల లైసెన్స్‌లు, రెన్యువల్స్ జారీ చేస్తుంటారు. ఆయా జిల్లాల్లోని దుకాణాలకు సంబంధించి తనిఖీలు, దాడులు, కేసులు కూడా ఆయా జిల్లాల పరిధిలోనే జరుగుతున్నాయి. ప్రస్తుతం కర్నూలులో ఇద్దరు, నంద్యాలలో ఇద్దరు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లపై ఏడీ, డీడీ స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఏడీ, డీడీ కార్యాలయాలు కర్నూలులో ఉన్నాయి. ఆయా జిల్లాల్లో ఎక్కడైనా తనిఖీలు చేపడితే సంబంధిత వివరాలు కర్నూలు కార్యాలయానికి అందుతుంది. వీరు జిల్లా వ్యాప్తంగా ఉన్న మందుల దుకాణాలు, ఏజెన్సీల్లో మందుల నాణ్యతను నిత్యం పరిశీలిస్తూ ఉంటారు. అనుమానం వచ్చిన మందులను ల్యాబోరేటరికి పరిశీలనకు పంపిస్తారు. నాణ్యతలో లోపం ఉంటే సంబంధిత విక్రయదారుడు, తయారీదారులపై చర్యలు తీసుకుంటారు. ఈ క్రమంలో రోగుల ఆరోగ్య పరిరక్షణలో ఈ విభాగం కీలక పాత్ర పోషిస్తోంది. దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో 8వేలకు పైగా ఫార్మాసిస్టులు విధులు నిర్వహిస్తున్నారు.

వైద్యుల తర్వాత ఫార్మాసిస్టే కీలకం

సాధారణంగా రోగులను వైద్యులు పరీక్షించి వారికి అవసరమైన చికిత్స అందిస్తారు. ఇందులో మందుల(ఔషధాలు) పాత్ర ప్రధానం. వీటిని ఫార్మాసిస్టులు రోగికి వివరించి అందజేస్తారు. రోగులకు కావాల్సిన మందులను ఎంత మోతాదులో వేసుకోవాలో వారు పేర్కొంటారు. వాటి వల్ల ప్రయోజనాలు కలిగేలా చేస్తారు. దుష్ప్రభావాల గురించి సైతం వివరిస్తారు. క్లినికల్ ఫలితాలను మెరుగుపరిచేందుకు మందులు వాడే విధానాన్ని, సురక్షితమైన వాడకం గురించి వివరిస్తారు. రోగికి సురక్షితమైన, సమర్థవంతమైన మందులు అందించేందుకు అనుక్షణం వారు ఆరాటపడుతుంటారు. రోగుల ఆరోగ్య సంరక్షణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తారు. ప్రజల ఆరోగ్య భద్రత రీత్యా ఔషధాల్లోని లోపాలను తగ్గించేందుకు ఫార్మాసిస్టులు ఎక్కువగా కృషి చేస్తారు. వారి జ్ఞానం, నైపుణ్యాలను ప్రజల ఆరోగ్యం కోసం ఎక్కువగా వినియోగిస్తారు. వారు తయారు చేసిన మందుల నుంచి రోగికి ఉత్తమ ఫలితం వచ్చేలా కృషి చేస్తారు. కొంత మంది ఫార్మాసిస్టులు ఫార్మాస్యూటికల్ కంపెనీల్లో పనిచేస్తారు. ఔషధ పరిశోధన, అభివృద్ధి, భద్రతా పరీక్షలకు సహకరిస్తారు.

రోగులకు దిశా నిర్దేశం చేయాలి



ఫార్మాసిస్టుల పర్యవేక్షణ లో మందుల క్రయ, విక్రయాలు జరగాలి. ఫార్మసీ చదివిన వారు సొంతంగా వ్యాపారం చేయాలి గానీ, ఇతరులు వ్యాపారం చేయడానికి వారి సర్టిఫికెట్లు ఇవ్వ కూడదు. రోగులు మందులు వాడటంలో ఫార్మాసిస్టు అవగాహన, చైతన్యం కలిగించాలి.మందులను ఎప్పుడు,ఎంత మేరకు, ఎలా వేసుకోవాలో రోగులకు వారు సూచించాలి. ఈ మేరకు ఫార్మాసిస్టులు రోగులను ఆకట్టుకోవాలి.

–రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

మందుల విషయంలో ఫార్మాసిస్టుదే బాధ్యత



రోగులకు వైద్యులు సూచించిన మేరకు సరైన మందులను అందించడంలో ఫార్మాసిస్టులే బాధ్యత వహించాలి. డాక్టర్లు సూచించిన సరైన మందులుఇవ్వడంతో పాటు నాణ్యమైన మందులను అందించాలి. తద్వారా రోగుల ఆరోగ్య సంరక్షణకు వైద్యులతో పాటు ఫార్మాసిస్టులు కీలక పాత్ర పోషించాలి.రోగులకు సరైన మందులను సరైనమోతాదులో అందేలా చూడటంతో పాటు ఎలా వాడాలో కూడా వివరించి చెప్పాలి.–హరిహరితేజ,డ్రగ్ ఇన్‌స్పెక్టర్, కర్నూలు

'పొలం పిలుస్తోంది'కి స్పందన కరువు

- పంట కోతలు చురుగ్గా జరుగుతుండటంతో పట్టించుకోని రైతులు
- పలు గ్రామాల్లో రైతుల కోసం ఎదురు చూపులు



మద్దికెర మండలంలో తూతూ మంత్రంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం ప్రారంభించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి రైతుల నుంచి స్పందన కరువైంది. రైతులు లేకపోవడం వల్ల పలు మండలాల్లో ఈ కార్యక్రమం తూతూమంత్రంగా సాగుతోంది. ఖరీఫ్ సీజన్ ఈ నెల చివరికి ముగియ నుంది. ఇప్పటికే వివిధ పంటలు కోతకు వచ్చాయి.అన్ని మండలాల్లో ఖరీఫ్‌లో సాగు చేసిన కొర్ర, సజ్జ పంటల కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వేరుశనగ పంట హార్వెస్టింగ్ కూడా ముమ్మరంగా జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో పొలం పిలుస్తోందంటూ ప్రభుత్వం వ్యవసాయ యంత్రాంగాన్ని గ్రామాలకు పంపుతూ హడావుడి చేస్తోంది. కోతలు చురుగ్గా జరుగుతున్న సమయంలో పొలం పిలుస్తోందనే కార్యక్రమం ఎవ్వరి కోసమో అనేది అర్థం కావడం లేదనే అభిప్రాయం రైతుల నుంచి వస్తోంది. మంగళవారం జిల్లాలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి జేడీఏ స్థాయి అధికారి ప్రత్యేక అధికారిగా కృపాదాస్ ఎమ్మిగనూరు మండలంలోని ముగతి, కడిమెట్ల గ్రామాల్లో పాల్గొన్నారు. ప్రత్యేక అధికారితో పాటు జిల్లా వ్యవసాయ అధికారి కూడా పాల్గొన్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలోనే రైతులు తూతూమంత్రంగా పాల్గొనడం గమనార్హం. ఈ కార్యక్రమానికి రైతులను తీసుకువచ్చే బాధ్యతను రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలకు అప్పగించారు. వీరు అతి కష్టం మీద 10 నుంచి 20 మంది వరకు తెస్తున్నట్లు సమాచారం.

50 గ్రామాల్లో పొలం పిలుస్తోంది...

జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలో 25 మండలాలు ఉండగా.. మొదటి రోజు 50 గ్రామాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి 591 మహిళతో పాటు 2311 మంది రైతుల ప్రకారం 2,902 మంది హాజరైనట్లు ఆయా మండల వ్యవసాయ అధికారులు సమాచారం ఇచ్చారు. అధికారిక లెక్కల ప్రకారమే ఒక గ్రామంలో సగటున 60 మంది రైతులు కూడా హాజరు కాలేదు. రోజు రెండు గ్రామాల్లో చేపడుతారు. మొదటి రోజు దాదాపు అన్ని మండలాల్లో నామమాత్రంగానే జరిగినట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వం ఏర్పాటై మూడున్నర నెలలు గడుస్తున్నా వ్యవసాయం గురించి పట్టించుకోని ప్రభుత్వం సీజన్ ముగింపు సమయంలో హడావుడి చేస్తుండటాన్ని చూసి వ్యవసాయ అధికారులే ముక్కున వేలేసుకుంటున్నారు.

గూడ్స్ రైలు ఢీ కొని రైతు మృతి



గూడ్స్ రైలు ఢీ కొని మృతి చెందిన రైతు సుంకన్న

తుగ్గలి : గూడ్స్ రైలు ఢీ కొని మంగళవారం ఓ రైతు మృతి చెందాడు. డోన్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన రైతు గుజ్జుల సుంకన్న (65) రాంపల్లి–ఎక్స్ రోడ్డు మధ్య రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీ కొంది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వృద్ధాప్యం కారణంగా ట్రైన్ శబ్దం సరిగా వినిపించక పోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సమాచారం అందుకున్న డోన్ రైల్వే పోలీసులు షబ్బీర్, సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

జీతాలు అందక ఆందోళన



కర్నూలు ఎంఆర్‌సీ దగ్గర వేతనాలు ఇవ్వాలని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష చిరుద్యోగులు

కర్నూలు సిటీ: సమగ్ర శిక్షలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, దినసరి కూలీలకు వేతనాలు చెల్లించేందుకు బడ్జెట్ మంజూరు కాలేదు. దీంతో ఆగస్టు నెల వేతనాలు చెల్లించకపోవడంతో చిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమగ్ర శిక్షలోని వివిధ విభాగాల్లోనూ, కస్తూర్బా గాంధీ విద్యాలయం, సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు సుమారుగా 600 మందికి వేతనాలు గత ప్రభుత్వంలో ఠంచన్‌గా ప్రతి నెల 1వ తేదీనే మంజూరయ్యేవి. అయితే రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వీరికి వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదు. సమగ్ర శిక్షకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి నిధులు మంజూరు చేసినా కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల సమగ్ర శిక్ష ఖాతాలకు జమ చేయకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోంది. సెప్టెంబరు నెల వేతనాలు సైతం వచ్చే పరిస్థితి కనిపించడం లేదని చిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం జిల్లాలోని అన్ని మండలాల విద్యా వనరుల కేంద్రాల దగ్గర భోజన విరామం సమయంలో వేతనాలు చెల్లించాలని కోరుతూ చిరుద్యోగులు నిరసన తెలిపారు.

నల్లమల ఘాట్‌లో లారీ బోల్తా




నల్లమల ఘాట్‌లోని వంతెన వద్ద అదుపు తప్పిన లారీ, నిలిచిపోయిన వాహనాలు

- ఉదయం నుంచి నిలిచిపోయిన భారీ వాహనాలు
- ఆకలి, దప్పులతో అలమటించిన ప్రయాణికులు

మహానంది: నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే నల్లమల ఘాట్ రోడ్‌లో మంగళవారం వేకువజామున గిద్దలూరు వెళ్తున్న ఉల్లిగడ్డల లారీ దిగువమెట్ట సమీపంలో ఉన్న ఇటుకల పురాతన వంతెన మలుపు వద్ద దిమ్మెలను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. కాగా అదుపు తప్పి బోల్తా పడిన లారీ రోడ్డుకు అడ్డుగా ఉండటంతో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కేవలం జీపులు, కార్లు మాత్రమే వెళ్తుండగా లారీ, బస్సులు ఆగిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నల్లమల అటవీ ప్రాంతం కావడంతో పలువురు ప్రయాణికులు, వృద్ధులు, పిల్లలు ఆకలి, దప్పులకు అలమటించారు. గిద్దలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అడ్డుగా ఉన్న లారీని పక్కకు తప్పించేందుకు క్రేన్లు తెప్పించారు. రాత్రి సుమారు 10 గంటల వరకు అంతరాయం ఏర్పడింది. గిద్దలూరు వైపు వెళ్తున్న వాహనాలు కొన్ని గాజులపల్లె, పచ్చర్ల వద్ద ఆగిపోయాయి.

దేవదాయ శాఖలో ఈవోల బదిలీలు

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖలో గ్రేడ్–1, 2, 3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లను(ఈవో) బదిలీ చేస్తూ ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రూప్ టెంపుల్స్ వారీగా గ్రేడ్–1 ఈఓల బదిలీలు ఇలా..

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
టి.జ్యోతి	కోవెలకుంట్ల	ప్రాతకోట
ఎస్.మోహన్	గడివేముల	కోటపాడు
జి.వేణునాదరెడ్డి	కోటపాడు	నంద్యాల గ్రూప్–1

గ్రూప్ టెంపుల్స్ వారీగా గ్రేడ్–2 ఈఓల బదిలీలు ఇలా..

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
జి.వెంకటసుబ్బయ్య	వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల	నంద్యాలజిల్లా ఎమ్.కృష్ణాపురం
టి.హనుమంతరావు	కర్నూలు –2	చిత్తూరు జిల్లా అరగొండ శ్రీ అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయం
టి.మద్దిలేటి	ఓర్వకల్	కాల్వబుగ్గ
పి.ఎస్.రాధాకృష్ణ	ఆదోని –1	కర్నూలు –2
ఎ.నాగ ప్రసాద్	ఎ.కోడూరు	బండి ఆత్మకూరు
జి.చంద్రశేఖరరెడ్డి	యాగంటి	ఓర్వకల్
డీఆర్‌కేవీ ప్రసాద్	కాల్వబుగ్గ	యాగంటి
ఆర్.వీరయ్య	గోస్పాడు	పెరవలి
ఎస్.రామలింగారెడ్డి	ప్రాతకోట	గడివేముల

గ్రూప్ టెంపుల్స్ వారీగా గ్రేడ్–3 ఈఓల బదిలీలు ఇలా..

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
టి.రామాంజనేయ శర్మ	నంద్యాల–1	కోటపాడు
ఎ.సాయికుమార్	మంత్రాలయం	హెచ్.మురవరి

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం



బోయ సీతా రాముడు (ఫైల్)

గోనెగండ్ల: అప్పుల బెంగతో నందవరం మండలం కనకవీడు పేటకు చెందిన బోయ సీతారాముడు(32) అనే యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. సీతా రాముడుకు ఆరేళ్ల క్రితం గోనెగండ్ల గ్రామానికి చెందిన బోయ మునీంద్రమ్మతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సీతా రాముడు సొంత ఊరిలో ఇల్లు కట్టుకోవడానికి రూ.8 లక్షలు అప్పు చేశాడు. తర్వాత ఈ అప్పును తీర్చే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. ఈ క్రమంలో చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి చూసేందుకు గోనెగండ్ల వచ్చిన సీతారాముడు. సోమవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో తండ్రి లచ్చన్నకు ఫోన్ చేసి చనిపోవాలనుకుంటున్నానని చెప్పాడు. తర్వాత పెద్దమరివీడు గ్రామ సమీపంలోని పార్లపల్లి రస్తాలో ఉన్న పొలాల్లో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాడు.

టెట్ పరీక్షకు రంగం సిద్ధం

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- వచ్చే నెల 3 నుంచి రెండు సెషన్లలో పరీక్షలు

కర్నూలు సిటీ: టీచర్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 9 కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాల్ టికెట్లను గత రెండు రోజులుగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ జారీ చేశారు. వచ్చే నెల 3 నుంచి 21వ తేది వరకు జరిగే టెట్ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు రెండు సెషన్లలో జరుగనుంది. టెట్ దరఖాస్తులు చేసుకున్న సమయంలో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న కేంద్రాలకే ప్రాధాన్యత ఇచ్చి కేంద్రాలను కేటాయించారు.

కర్నూలు జిల్లాలో 6, నంద్యాల జిల్లాలో 3 కేంద్రాలు

టెట్ పరీక్షల నిర్వహణకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో కర్నూలు జిల్లాలో 6, నంద్యాలలో 3 కేంద్రాలు ఉన్నాయి. ఐయాన్ డిజిటల్ కె.వి సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఐయాన్ డిజిటల్ సనత్‌నగర్, బిట్స్ కాలేజీ (పెద్దటేకూరు), జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, భీమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, ఆదోని, సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీ, ఎమ్మిగనూరు, ఆర్‌జీఎం కాలేజీ నంద్యాల, శాంతిరాం ఇంజినీరింగ్ కాలేజీ, ఎస్.వి.ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, నంద్యాలను కేంద్రాలుగా ఎంపిక చేశారు.

పిల్లలు కాలేదని..



మృతి చెందిన మహేశ్వరి

వెల్దుర్తి(కృష్ణగిరి): వివాహం జరిగి రెండేళ్లు గడిచినా పిల్లలు కాలేదని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. వెల్దుర్తి మండల పరిధిలోని కొసనాపల్లి గ్రామంలో మంగళవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన పద్మావతి కుమార్తె మహేశ్వరి(24)ని, కొసనాపల్లి గ్రామానికి చెందిన మధుగౌడ్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి పిల్లలు కాలేదు. ఈ విషయంలో మహేశ్వరి తీవ్ర మనస్థాపానికి గురై తెల్లవారు జామున ఇంట్లో రసాయనిక ద్రావణం తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించగా మార్గమధ్యంలోనే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతిరాలి తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ పేర్కొన్నారు.

ఎట్టకేలకు సబ్ రిజిస్ట్రార్ల బదిలీ

- ఖాళీగానే కర్నూలు, కల్లూరు ఎస్‌ఆర్‌ఓలు

కర్నూలు(సెంట్రల్) : తీవ్ర కసరత్తు, రాజకీయ సిఫారసుల నడుమ ఎట్టకేలకు సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ఆ శాఖ డీఐజీ పీజీ కల్యాణి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా 19 మంది సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. వాటిలో పని చేస్తున్న 28 మంది సీనియర్ అసిస్టెంట్లను కూడా బదిలీ చేశారు. కాగా, అత్యంత కీలకమైన కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏ సబ్ రిజిస్ట్రార్ ఎంపిక చేసుకోకపోవడం గమనార్హం.

రిజిస్ట్రార్ పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
సి.జగదీష్ ఖన్నా	అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, కర్నూలు	సూపరింటెండెంట్, డీఐజీ ఆఫీస్, కర్నూలు
ఎం.చంద్రమౌళి	నందికొట్కూరు	సబ్‌రిజిస్ట్రార్,మార్కెట్‌వాల్యు అండ్ ఆడిట్, కర్నూలు
టి.తేజోవతి	పాణ్యం	కోడుమూరు
కె.అబ్దుల్ కరీం	బేతంచర్ల	ఆత్మకూరు
ఎం.ఆదినారాయణ	ఆత్మకూరు	బండి ఆత్మకూరు
వై.బజారి	డోన్	కోసిగి
జె.వి.ఎన్.రాజు	బండిఆత్మకూరు	పాణ్యం
కె.శ్రీనివాసులు	ఉరవకొండ	ఎమ్మిగనూరు
ఎన్.ఎ.ఆర్.ఫైరోజ్	ప్యాపిలి	ఓర్వకల్లు
ఎన్.అబ్దుల్ సత్తార్	ఆళ్లగడ్డ	జాయింట్ సబ్ రిజిస్ట్రార్1,నంద్యాల
ఎస్.మహబూబ్ బాషా	కోడుమూరు	డోన్
జి.మల్లికార్జున రావు	జాయింట్ ఎస్‌ఆర్–2, కదిరి	ఆలూరు
జి.రాజచంద్రమౌళి	సిద్ధవటం	జాయింట్ సబ్ రిజిస్ట్రార్2, నంద్యాల
మురళి సుందరరావు	ఆలూరు	పత్తికొండ
ఎస్.ఎం.మౌలా	పత్తికొండ	నందికొట్కూరు
కె.శివకుమార్	గూడూరు	కోయిలకుంట్ల
సి.వనితా లక్ష్మి	జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–2, నంద్యాల	బేతంచెర్ల
పి.జయవాణి	ఓర్వకల్లు	ప్యాపిలి
ఎం.చైతన్య రాయుడు	జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–2, కర్నూలు	ఆళ్లగడ్డ